ప్రజాశక్తి

శనివారం 7 సెప్టెంబరు, 2024

5

శ్రీకాకుళం

11న అప్రెంటిస్ మేళా

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

ఎచ్చెర్లలోని ప్రభుత్వ ఐటిఐలో ఈ నెల 11న పిఎం జాతీయ అప్రెంటిస్ షిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ఐటిఐ ప్రధానాచార్యులు, జిల్లా కన్వీనర్ ఎల్.సుధాకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాకు జిల్లాలోని ఎనిమిది ప్రముఖ కంపెనీలు హాజరవుతున్నాయని అన్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రయివేటు ఐటిఐల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు బయో డేటాతో పాటు ఆధార్, పదో తరగతి, ఐటిఐ ఉత్తీర్ణత ధ్రువపత్రాలతో ఉదయం 9 గంటలకు హాజరుకావాలని పేర్కొన్నారు. ఈ మేళాకు జిల్లాలోని అరబిందో, శ్యాంక్రర్ఫిస్టన్స్, నాగార్జున అగ్రికెం, స్మార్ట్ కెం, వరుణ్ మోటార్స్ తదితర కంపెనీలు హాజరవుతున్నట్లు తెలిపారు. ఐటిఐ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టిటిడికి పలాస జీడిపప్పు

- నెరవేరిన దశాబ్దాల కల
- తొలిసారి బిడ్ దక్కించుకున్న వ్యాపారి
- రోజుకు 3 టన్నుల సరఫరాకు అంగీకారం

పలాస జీడిపప్పుకు అంతర్జాతీయంగా గుర్తింపు ఉంది. అటువంటి జీడి పప్పుకు తిరుమల తిరుపతి దేవస్థానంలో అమలవుతున్న లడ్డూ ప్రసాదంలో జీడిపప్పుకు స్థానం దక్కింది. జీడీ వ్యాపార సంఘాలు పలు దఫాలుగా ప్రయత్నాలు చేసినా... టిటిడి నిబంధనలు మాయాజాలంతో ఆ అవకాశాన్ని దక్కించుకోలేకపోయింది. ఎట్టకేలకు టిటిడి లడ్డులో యాత్రికులకు అందనుంది. హేమాహేమీలు సైతం పక్కనపెట్టి పలాసకు చెందిన ఓ సాధారణ జీడి పరిశ్రమతో అంచెలంచెలుగా ఎదిగిన కోరాడ సంతోష్‌కు ప్రసాదం టెండర్లను దక్కించుకోవడంతో జీడీ పరిశ్రమదారులు, ఉద్దానం వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే....

ప్రజాశక్తి- పలాస

ఇప్పటి వరకు అంతర్జాతీయ ఖ్యాతి స్థాయిలో పలాస ఉద్దానం జీడిపప్పుగా నోరురుంచేది. ఇప్పుడు టిటిడి ప్రసాదం లడ్డు రూపంలో యాత్రికుల చెంతకి చేరనుంది. సింహాచలం దేవస్థానంలో పులిహోరకు, అన్నవరంలో పొంగలికి ప్రత్యేకం. అదేవిధంగా జాతీయ స్థాయిలో తిరుపతి వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదానికి ఎంతో ప్రాధాన్యం, ప్రాముఖ్యత ఉంది. టిటిడి లడ్డు రుచి, సువాసనలో ఆ ప్రత్యేకతే వేరు. ఈ లడ్డూ తయారీకి వినియోగించే వస్తువుల్లో జీడిపప్పు కూడా ప్రధాన భూమిక పోషిస్తోంది. ఇకపై ఈ లడ్డూలో పలాస జీడిపప్పునకు స్థానం దక్కింది. పలాసకు చెందిన వ్యాపారి కోరాడ సంతోష్ టిటిడికి జీడిపప్పు సరఫరా చేసే టెండర్లు దక్కించుకున్నారు. మూడు రోజుల కిందట గ్లోబల్ విధానం ద్వారా టెండర్లు పిలిచారు. కర్నాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు చెందిన వందలాది మంది వ్యాపారులు పోటీ పడ్డారు. దేశవ్యాప్తంగా 3 వేలకు పైగా జీడి పరిశ్రమలు ఉండగా, అనూహ్యంగా పలాస వ్యాపారికి ఈ అవకాశం దక్కిడం హర్షణీయం. తిరుపతి బాలాజీ లడ్డూల తయారీకి రోజూ 3 టన్నుల జీడి పప్పు అవసరం. ప్రస్తుతం జెహెచ్ (బద్ద) రకం జీడిపప్పు సరఫరా చేయాలని టిటిడి నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు ఆ రకం పప్పు సరఫరా చేసేందుకు నిర్వాహకులు సిద్ధమవుతున్నారు.

టిటిడి ప్రసాదంగా ఉద్దానం పలాస జీడిపప్పు వెళు ుండడంతో దానికి అనుగుణంగా శుభ్రత, నాణ్యత, శుచితో తయారు చేస్తున్నారు. మొత్తం 300 మంది కార్మికులు రెండు రోజుల నుంచి జెహెచ్ రకం జీడిపప్పు తయారు చేస్తూ, కిలో, రెండు, ఐదు, పది కిలోలు చొప్పున ప్యాకింగ్ చేస్తున్నారు. నెలకు సరిపడా జీడిపప్పును వారం రోజుల్లో పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

నెరవేరిన వేళ

టిటిడి లడ్డూ ప్రసాదానికి పలాస ఉద్దానం జీడిపప్పు వెళ్తుండడంపై అటు వ్యాపార వర్గాల నుంచి, ఉద్దానం జీడి రైతాంగం నుంచి హర్షత్ రేఖల వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటివరకు టిటిడికి కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి గుత్త పద్ధతిలో జీడీ పప్పుని సేకరించేవారు. మొదట నేరుగా తిరుమల తిరుపతి దేవస్థానమే కొనుగోలు చేసేది. అనంతరం పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో గ్లోబల్ టెండర్ల ద్వారా సేకరిస్తున్నారు. జీడిపప్పు తయారీలో ఆంధ్రప్రదేశ్ దేశవ్యాప్తంగా ఐదో స్థానంలో ఉంది. పెనం మీద జీడీ పిక్కలు కాల్చి పప్పు తయారీ చేసిన విధానం నుంచి ప్రస్తుతం ఆధునిక పరిశ్రమలతో జీడిపప్పును తయారీ విధానంలోకి వచ్చిన పరిస్థితిలు ఎప్పటికీ మరువలేని చరిత్ర. పిసిఎంఎ అధ్యక్షులుగా పనిచేసిన మల్లా నూకరాజు సమయంలో పలాస జీడీ వ్యాపారులకు టిటిడి అవకాశం కల్పించింది. లడ్డు ప్రసాదం తయారీకి జీడీ పప్పుని సరఫరా చేసేందుకు అవకాశం కల్పించారు. కొద్ది రోజులు నాణ్యతతో కూడిన జీడిపప్పు సరఫరా చేసినప్పటికీ, తరువాత కాలంలో కొద్దిమంది వ్యాపారులు క్వాలిటీ లేని జీడిపప్పును టిటిడికి పంపించడంతో పాటు, ప్రసాదానికి అవసరమైన ఆ స్థాయిలో సరఫరా చేయలేకపోవడంతో పలాస జీడిపప్పును టిటిడి పక్కన పెట్టింది. కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలు పోటీ పడి జీడిపప్పు సరఫరా టెండర్లు దక్కించుకున్నాయి. అప్పటి నుంచీ ఆంధ్రా జీడిపప్పు విదేశాలకు విక్రయాలకు తప్ప.. స్వదేశంలో ఉన్న ప్రధాన ఆలయ ప్రసాదాలకు నోచుకోలేదు. ఎట్టకేలకు పలాస జీడిపప్పు చాలా ఏళ్ల తరువాత టిటిడి లడ్డూలో ప్రధాన భూమిక పోషించనుండ డంతో వ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆనందంగా ఉంది

తిరుపతి లడ్డూకు జీడి పప్పు తరలించే అవకాశం లభించడం ఆనందంగా ఉంది. లాభాపేక్ష లేకుండా టిటిడికి అందించాలని అనుకుంటున్నా.

- కె.సంతోష్‌కుమార్, ఎస్ఎస్ఎస్ ఇంటర్నేష సల్ ఆగ్రో చైర్మన్

జిల్లాలో పలుచోట్ల వర్షాలు

కొనసాగుతున్న అల్పపీడనం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

వాయుగుండం ముప్పు నుంచి గట్టెక్కినా జిల్లాపై అల్పపీడన ప్రభావం కొనసాగుతోంది. పశ్చిమ మధ్య వాయువ్య బంగాళాఖాతంలో ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా పరిసరాల్లో అల్పపీడనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో రాగల 24 గంటల్లో ఒక మోస్తారు వర్షాలు పడతాయని వాతావరణశాఖ హెచ్చరించింది. శుక్రవారం జిల్లాలో పలుచోట్ల వానలు కురిశాయి. గార మండలం కళింగపట్నంలో అత్యధికంగా 14 మి.మీ వర్షపాతం నమోదయింది. శ్రీకాకుళం నగరం, కొత్తూరు, ఎల్ఎన్‌పేట మండలం కోవిలంలో అత్యల్పంగా 0.25 మి.మీ చొప్పున వర్షపాతం నమోదయింది. సంతబొమ్మాళి, పలాసలో చెరో 7.5 మి.మీ చొప్పున వర్షం కురిసింది. కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో 0.75మి.మీ, జి.సిగడాంలో 0.50 మి.మీ వర్షం పడింది.

వైసిపి శవ రాజకీయాలు మానుకోవాలి

కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మాట్లాడుతున్న రామ్మోహన్ నాయుడు

'ఇళ్లు కాలి బాధితుడు ఉసురు మంటుంటే సిగరెట్ కాల్చుకునేందుకు నిప్పడిగిన' చందంగా వైసిపి నాయకులు వ్యవహరిస్తున్నారని, గడచిన ఐదేళ్ల పాలనను ప్రజలు ఎందుకు ఛీత్కరించారో వారు గుర్తు చేసుకోవాలని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వ్యాఖ్యానించారు. నగరంలోని ఏడు రోడ్ల రోడ్ల కూడలి వద్ద శుక్రవారం మీడియాతో మాట్లాడారు. విజయవాడ మహానగరం విపత్కర పరిస్థితి ఎదుర్కొన్న సమయంలో పెద్దఎత్తున ముంపునకు గురై ప్రజలు నిరాశ్రయులై ఆవేదన చెందుతున్నారని అన్నారు. ఈ తరుణంలో మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి మొక్కుబడిగా ఒకచోట తిరిగి తాడేపల్లివెళ్లి పోయారని, ప్రజలను ఓదార్చాలన్న ఆలోచన కూడా కోల్పోయారని అన్నారు. వరద ప్రాంతాల్లో రేయింబవళ్లు నీటిలోనే తానున్నానని భరోసా కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు పనితానాన్ని ప్రజలు గుర్తించారన్నారు. గతంలో ఉత్తరాంధ్రా ప్రాంతంలో హుదూద్ తుపాను సమయంలో వేలాది మంది నిరాశ్రయులయ్యారన్నారు. జిల్లా పనర్నిర్మాణానికి టిడిపి నాయకులు క్షేత్ర స్థాయిలో ప్రజలకు అండగా నిలిస్తే... జగన్ మాత్రం విజయనగరం నుంచి శ్రీకాకుళం కూడా రాలేదన్నారు. అంతటి కర్కశ మనస్థత్వం ఉన్న జగన్ ఇప్పుడు విజయవాడలో బురద రాజకీయాలు చేస్తూ చంద్రబాబుపై బురదజల్లేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రజలకు మేలు చేయాలన్న ఆలోచన చంద్రబాబుకు ఉందని, అందువల్ల గడచిన ఆరు రోజులుగా రాత్రింబవళ్లు అక్కడే ఉండి ప్రజలకు అండగా నిలిచారని అన్నారు. మరో వైపు వరదలతో తీవ్రంగా నష్టపోయిన రైతాంగానికి ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు మొదలు పెట్టిందన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు భరోసా కల్పించిన చంద్రబాబుపై ప్రజల్లో ఎంతో విశ్వాసం ఉందన్నారు.

పని సర్దుబాటుతో విద్యార్థుల ఇంటిబాట

నిరసన తెలిపిన చీమలవలస గ్రామస్తులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని చీమలవలస ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు విద్యాశాఖ అధికారుల నిర్వాకంతో ఇంటి బాట పట్టారు. గ్రామంలోని పాఠశాల వద్దకు సర్పంచ్ సనపల చెల్లంనాయుడు, ఎఫ్ఎంసి చైర్మన్ బొడ్డేపల్లి వైకుంఠరావు, విద్యార్థుల తల్లిదండ్రులు చేరుకొని పని సర్దుబాటు కింద ఉపాధ్యాయులను బదిలీ చేయడంపై శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో ఒకటి నుంచి ఐదు వరకు 33, ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు 30 మంది, మొత్తం 63 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. గతంలో ఈ పాఠశాలలో ఏడుగురు ఉపాధ్యాయులు పనిచేసేవారని పేర్కొన్నారు. అందులో ఒకరు ఇటీవల ఉద్యోగ విరమణ పొందారని అన్నారు. మిగిలిన ఆరుగురు ఉపాధ్యాయుల్లో నలుగురిని పని సర్దుబాటు పేరుతో చీమలవలస నుంచి ఇతర పాఠశాలలకు బదిలీ చేశారని చెప్పారు. దీంతో ఇద్దరు మాత్రమే తమ పాఠశాలలో మిగిలి ఉన్నారన్నారు. మిగిలిన ఇద్దరిలో ఒకరు దీర్ఘకాలిక సెలవులో ఉన్నారని తెలిపారు. పని సర్దుబాటులో భాగంగా చీమలవలస పాఠశాలకు ముగ్గురు ఎంటిఎస్ ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. అధికారులు, వైసిపి నాయకులు కుమ్మక్కై పాఠశాల పేరును చెడగొట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. తక్షణమే సబ్జెక్టు ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎంఇఒ -2 టింగరాజును చేరుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు ప్రకారమే తాము నడుచుకుంటున్నామని, తమకు ఎవరిపై కోపం లేదని అన్నారు. తెలుగు లాంగ్వేజ్ పండిట్ ఉపాధ్యాయుడిని పని సర్దుబాటు కింద బదిలీ చేయడానికి జిఒ వర్తించదని సర్పంచ్ ఎంఇఒ-2ను నిలదీశారు. పాఠశాలలో విద్యార్థులు అధిక సంఖ్యలో ఉన్నా... సమర్థవంతమైన ఉపాధ్యాయులను నియమించకపోవడంపై సర్పంచ్ అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో పని సర్దుబాటు కింద ఉపాధ్యాయులను మార్చడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రయివేట్ పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు. జీవోలను తుంగలో తొక్కి ఇష్టారీతిన వ్యవహరిస్తున్న ఎంఇఒలపై కలెక్టర్ ఫిర్యాదు చేఉస్తానని అన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు అన్నెపు రమణమూర్తి, నీలయ్య పాల్గొన్నారు.

ఇంటిబాట పడుతున్న విద్యార్థులు

ముగిసిన ఎస్ఎ పరీక్షలు

ప్రజాశక్తి- టెక్కలి

రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యాన నిర్వహించిన స్టూడెంట్ ఎసస్‌మెంట్ పరీక్షలు (ఎస్ఎ) శుక్రవారంతో ముగిశాయి. ఈ నెల 2న తపాను కారణంగా విద్యాసంస్థలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. దీంతో ఆరోజు నిర్వహించాల్సిన గణితం పరీక్ష శుక్రవారం జరిగింది. వాస్తవంగా వాయిదా వేసిన పరీక్ష ఈ నెల 9న జరగాల్సి ఉంది. కానీ, జిల్లా విద్యాశాఖాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులకు గత ప్రభుత్వం మాదిరిగానే ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు ఒఎంఆర్ షీటు విధానం ద్వారా జవాబుపత్రాలు ఇచ్చారు. 9, 10 తరగతులకు జవాబుపత్రాలు అందజేశారు. విద్యార్థులు రాసిన జవాబుపత్రాలను మూల్యాంకనం చేపట్టి మార్కులను విద్యాశాఖ కార్యాలయానికి పంపనున్నారు. విద్యార్థులు రాసిన ఒఎంఆర్ షీటులు మండల రీసోర్సు కేంద్రానికి ఆయా పాఠశాలల ప్రదానోపాధ్యాయులు పంపించారు.

పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పర్యావరణ పరిరక్షణపై శ్రద్ధ

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పారిశుధ్య నిర్వహణతో పాటు పర్యావరణ పరిరక్షణపై ప్రతిఒక్కరూ శ్రద్ధ వహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. నగరంలోని కెల్ల వీధిలో పురపాలక సంఘం అధికారులు నిర్వహిస్తున్న డ్రైడే ఫ్రై డే అమలు తీరును శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మున్సిపల్ సిబ్బంది విధులకు హాజరుపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ప్రజలు డ్రై డే ఫ్రై డే పాటించాలన్నారు. కీటకజనిత వ్యాధుల నుంచి జాగ్రత్తగా ఉండాలన్నారు. దోమల లార్వా పెరగకుండా, నీటి కుంటలు లేకుండా చూసుకోవాలన్నారు. మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల నుంచి తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈయనతో పాటు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ బి.గణేష కుమార్, సచివాలయ, మున్సిపల సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : నిరసన తెలుపుతున్న స్టాఫ్‌నర్సులు

కాంట్రాక్టు స్టాఫ్‌నర్సుల నిరసన

శ్రీకాకుళం అర్బన్ : జిఒ 115ని తక్షణమే రద్దు చేయాలని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ స్టాఫ్‌నర్సులను రెగ్యులర్ చేయాలని స్టాఫ్‌నర్సుల సంఘం నాయకులు వేదవతి డిమాండ్ చేశారు. నగరంలోని జిల్లా సర్వజనాస్పత్రి వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అందరికీ కాంట్రాక్టు స్టాఫ్‌నర్స్‌గా ఉద్యోగాలు వచ్చిందని అన్నారు. కరోనా విపత్కర సమయంలో తమ ప్రాణాలను తెగించి ఎంతోమంది ప్రాణాలు కాపాడామని గుర్తు చేశారు. తమ కుటుంబాలను సైతం పక్కనపెట్టి ఆస్పత్రిలోని కరోనా రోగులకు వైద్య సేవలు అందించామని అన్నారు. ఇందులో భాగంగా 13 మంది ప్రాణాలు కోల్పోయారని, వారికి ఇంతవరకు ప్రభుత్వం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

టెక్కలి రూరల్: టెక్కలి జిల్లా ఆస్పత్రి ఆవరణలో ఆవరణలో కాంట్రాక్టు నర్సులు నిరసన తెలిపారు. 2011 నుంచి నర్సులుగా విధులు నిర్వహిస్తున్న తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ... నినాదాలు చేశారు. కరోనా వంటి పరిస్థితుల్లో సేవలు అందించిన తమ సేవలకు తగిన గుర్తింపును ఇవ్వకుండా ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని ఆరోపించారు.

ఆస్పత్రి నిర్వహణపై ఎమ్మెల్యే అసంతృప్తి

ప్రజాశక్తి- పలాస

ఆస్పత్రిలో పారిశుధ్య నిర్వహణ బాగులేదని ఎమ్మెల్యే గౌతు శిరీష అసంతృప్తి వ్యక్తం చేశారు. వారంరోజుల్లో పారిశుధ్య సమస్యలు మెరుగుపడకపోతే సంబంధిత కాంట్రాక్టర్‌ను సాగనంపాలని ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం మధ్యాహ్నం ఆస్పత్రిని పరిశీలించారు. ఈ పరిశీలనలో వార్డుల నుంచి ఆస్పత్రి పరిసరాల వరకూ పారిశుధ్య సమస్యలు తీవ్రంగా ఉన్నట్లు గుర్తించారు. రోగులు ఆస్పత్రిలో ఏ విధంగా ఉంటున్నారో అర్థం కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం సంబంధిత కాంట్రాక్టర్ తో ఫోన్ మాట్లాడారు. రూ.లక్షల నిధులు ప్రభుత్వం ఇస్తుందని, కనీసం పారిశుధ్య సమస్యలు పరిష్కరించకపోతే ఎలా అని ప్రశ్నించారు. వార్డులో శుభ్రత లేదని, మరుగుదొడ్ల పరిస్థితి దయనీయంగా ఉందని అసహనం వ్యక్తం చేశారు. ఆస్పత్రి ఆవరణ అంతా చెత్తతో నిండిపోయిందని, కనీసం చూడడానికీ ఇబ్బందిగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో రెండు రోజుల్లో ఈ సమస్య పరిష్కరిస్తామని సంబంధిత కాంట్రాక్టర్ వివరణ ఇచ్చారు. వారం రోజుల్లో మళ్లీ తాను ఆస్పత్రిని సందర్శిస్తానని, పారిశుధ్య సమస్యలు మెరుగుపడకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రోగులకు సొంత క్లినిక్లకు తరలిస్తున్నారా!

ప్రభుత్వాస్పత్రికి వస్తున్న రోగులను సొంత క్లినిక్లకు తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని, మరోసారి ఆరోపణలు వస్తే చర్యలు తప్పవని వైద్యాధికారులకు ఆమె హెచ్చరించారు. దీనిపై వైద్యులు టి.పాపినాయుడు, చిన్నంనాయుడు, రఘురామ్, సుశీల, అశ్వని మాట్లాడారు. ఇక్కడకు వస్తున్న రోగులకు ఆస్పత్రిలోనే వైద్యం అందిస్తున్నామని సంబంధిత రికార్డులను వైద్యులు చూపించారు. కొంతమంది వైద్యాధికారులను ఇబ్బందులు పెడుతున్నారని సూపరింటెండెంట్ టి.పాపినాయుడును ప్రశ్నించడంతో, ఇక్కడ అంతా సమానమేనని, ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకోవచ్చని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే వార్డుల్లోను తిరుగుతు రోగులకు కల్పిస్తున్న సేవలు అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట టిడిపి నాయకులు ఎం.నరేంద్ర (చిన్ని), లొడగల కామేశ్వరావుయాదవ్, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు, అంబటి కృష్ణమూర్తి ఉన్నారు.

వైద్యులను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

జపనీస్ భాషపై శిక్షణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నావిస్ హెచ్ఎర్ సంయుక్తంగా ఎఎన్ఎం/జిఎన్ఎమ్/బిఎస్‌సి నర్సింగ్ చదివిన అభ్యర్థులకు జపనీస్ భాష ఎన్5, ఎన్4, ఎన్3 స్థాయిల్లో నేర్పించి, వారికి జపాన్ దేశంలో నర్సులుగా ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ పొందే అభ్యర్థులు తప్పనిసరిగా జపాన్ దేశంలో పనిచేయడానికి ఆశక్తి కలిగిన వారై ఉండాలన్నారు. 20 నుంచి 32 ఏళ్ల మధ్య వయసు ఉన్న అభ్యర్థులు అర్హులన్నారు. నావిస్ హెచ్ఆర్ బెంగుళూరులో ఆరు నెలల పాటు శిక్షణ ఉంటుందని, మొత్తం శిక్షణ ఫీజు రూ.3.50 లక్షలని, పాక్షిక శిక్షణ రుసుం రూ.50 వేలు ఉంటుందని తెలిపారు. ఇందులో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ రూ.25 వేలు, అభ్యర్థి రూ.25 వేలు చెల్లిస్తారని అన్నారు. మిగిలిన రూ.3 లక్షలు సంస్థ బ్యాంకు ద్వారా రుణ సదుపాయం కల్పిస్తుందన్నారు. ఫీజు మూడు విడతలుగా అభ్యర్థి చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పించనున్నట్టు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి జపాన్ దేశంలో ఉద్యోగ అవకాశం కల్పించడానికి అవసరమైన సదుపాయాలు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నావిస్ హెచ్ఎర్ పర్యవేక్షిస్తుందని వివరించారు. ఉద్యోగం పొందిన అభ్యర్థికి జీతం నెలకు రూ.1.10 లక్షలు నుంచి రూ.1.40 లక్షల వరకు ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు https://shorturl.at/FB7ok వెబ్‌లింక్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9988853335, 7780167645 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పెసర గణపతి

ఈసారి పెసర గణపతి

కవిటి: పర్యావరణానికి హానికలిగించకుండా వినాయక చవితి నిర్వహిస్తున్న బొరివంక్ యూత్ క్లబ్ సభ్యులు ఈ ఏడాది ముగ్గ(పెసర) గణపతిని ఏర్పాటు చేసి తమ ప్రత్యేకత చాటుకున్నారు. గ్రామానికి చెందిన శిల్పి భైరి తిరుపతి పెసర విత్తనాలు వేసి దానిద్వారా వచ్చిన నారుతో ఈ వినాయక విగ్రహాన్ని తయారు చేశారు. పర్యావరణానికి హాని కలిగించకుండా వినాయక విగ్రహాలు తయారు చేయడంలో ఆరితేరిన తిరుపతి 2012 నుంచి తన ప్రత్యేకత చాటుకుంటున్నారు. 2012లో కొబ్బరికాయల గణపతి, 2013లో నలుగు గణపతి, 2014లో వరినారు గణపతి, 2015లో వనమూలికల గణపతి, 2016లో పామాయిల్ గణపతి, 2017లో గోధుమనారు గణపతి, 2018లో కొబ్బరి పువ్వుల గణపతి, 2019లో సుద్దముక్కల గణపతి, 2021లో నల్లజీడి పిక్కల గణపతి, 2022లో ఆవాలు గణపతి, 2023లో పసుపు కొమ్ముల గణపతి, ఇప్పుడు 2024లో ముగ్గ(పెసర) గణపతిని రూపొందించారు. పర్యావరణహితాన్ని కోరే తిరుపతి ఈ రంగంలో ఇప్పటికే పలు అవార్డులు కూడా అందుకున్నారు.

చవితి శోభ

కిటకిటలాడిన మార్కెట్లు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో వినాయక చవితి ఉత్సవాలను ప్రజలు ఘనంగా నిర్వహించుకునేందుకు సిద్ధమవుతున్నారు. పోలీసు నిబంధనలకు లోబడి వాడవాడలా మండపాలను సిద్ధం చేస్తున్నారు. చవితి వేడుకలకు అవసరమైన సామగ్రి విక్రయాలు జోరందుకున్నాయి. వేడుకలకు అవసమయ్యే సామగ్రిని కొనుగోలు చేసేందుకు పట్టణ ప్రాంతాలకు జనం పోటెత్తారు. దీంతో శ్రీకాకుళం నగరం, రణస్థలం, ఆమదాలవలస, పాతపట్నం, మెళియాపుట్టి, పలాస, టెక్కలి, సోంపేట, ఇచ్ఛాపురం, ఇచ్ఛాపురం, నరసన్నపేట, కోటబొమ్మాళి వంటి పట్టణ ప్రాంతాల్లో ప్రధాన కూడళ్లు కిటకిటలాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి మార్కెట్‌కు జనం తరలిరావడంతో పెద్దఎత్తున కొనుగోళ్లు సాగాయి. శుక్రవారం ఉదయం నుంచి వాతావరణం అనుకూలంగా ఉండడంతో పండగ వ్యాపారాలు బాగా సాగాయి. పూజా సామగ్రికి అవసరమైన 10 రకాల ఫలాలను రూ.వంద, పువ్వులు కేజీ రూ.240 నుంచి రూ.260 వరకు వ్యాపారులు విక్రయించారు. మట్టి వినాయకులు, కుమ్మరి బొమ్మలు, పళ్లు, పత్రి, ఇతర పూజా సామగ్రిని విక్రయించుకుని ఉత్సవాలకు సిద్ధం చేసుకుంటున్నారు. ఈ వేడుకల్లో పెసర పప్పు, బెల్లం, వరి పిండి, అటుకులు వంటి సామగ్రికి గిరాకీ ఉండడంతో వాటి వ్యాపారాలు ఘనంగా సాగాయి. పండగ పూట ఇతర వస్తువులను కొనుగోలు చేసుకునేందుకు జనం క్యూకట్టడంతో శ్రీకాకుళం పొట్టి శ్రీరాములు మార్కెట్ కిటకిట లాడింది. పెద్దఎత్తున మట్టి బొమ్మలను వివిధ సంఘాలు, వ్యాపార సంస్థలు, రాజకీయ నాయకులు ఉచితంగా పంపిణీ చేశారు. మట్టి బొమ్మలు రూ.30 నుంచి రంగుల బొమ్మలు రూ.వేలాదిగా ధరలు నిర్ణయించారు. బొమ్మను బట్టి ధర నిర్ణయించి విక్రయించగా పూజా సామగ్రి, పళ్లు, పువ్వుల ధరలు ఆకాశాన్ని అంటాయి. వినాయక చవితి సందడి మార్కెట్‌లో వ్యాపారులకు కాసులు కురిపించగా... సామాన్యులకు ఈ పండగ భారంగా మారింది. శని, ఆదివారం సెలవులు కావడంతో దూర ప్రాంతాల్లో ఉన్న వారంతా సొంతూళ్లకు రావడానికి తరలిరావడంతో శ్రీకాకుళం, టెక్కలి, పలాస ఆర్‌టిసి బస్సుల్లో రద్దీ పెరిగింది. దీంతో నగరంలోని బస్టాండ్‌లో జనం సందడిగా కనిపించారు. విశాఖ, విజయనగరం జిల్లాలతో పాటు పాలకొండ, ఇచ్ఛాపురం, బత్తిలి, పాతపట్నం వంటి ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో మరింత రద్దీ కనిపించింది.

మార్కెట్‌లో సామగ్రిని కొనుగోలు చేస్తున్న యాత్రికులు

రద్దీగా ఉన్న శ్రీకాకుళం బస్టాండ్

మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న రామ్మోహన్ నాయుడు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వినాయక మండపాల్లో ఏర్పాటు చేసిన గణపతి ప్రతిమలు మట్టితో చేసినవైతే కాలుష్య నియంత్రణకు దోహదపడతాయని కేంద్ర పౌర విమానాయన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శుక్రవారం ఏడురోడ్ల కూడలి వద్ద మట్టి గణపతి బొమ్మలను ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌లతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడేందుకు మట్టితో తయారు చేసిన గణపతినే పూజించాలన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో పాటు రసాయనాలు కలిసిన రంగులతో ముస్తాబు చేసిన బొమ్మలతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ బొమ్మల తయారీకి సహజ సిద్ధమైన రంగులను వాడాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మాదారపు వెంకటేష్, కొర్ను ప్రతాప్, జామి భీమ శంకరరావు, దాసునాయుడు, వార్డు ఇన్‌ఛార్జిలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

వరద బాధితులకు ఉద్యానశాఖ సాయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వరదలతో నష్టపోయిన విజయవాడ బాధిత కుటుంబాల సహాయార్థం జిల్లా ఉద్యానశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు, రైతులు, రైతు సంఘాలు తమవంత సాయాన్ని శుక్రవారం రాత్రి పంపించారు. బియ్యం వెయ్యి కేజీలు, వాటర్ బాటిళ్లు వెయ్యి, బిస్కెట్ ప్యాకెట్లు వెయ్యి, అరటి పళ్ల 40 గెలలు, ఉల్లిపాయలు వంద కేజీలు, వంకాయలు వంద కేజీలు, క్యాబేజి వంద కేజీలు, బంగాళాదుంపలు వంద కేజీలు, చిక్కుడు కాయలు వంద కేజీలు, ఆనయకాయలు వంద కాయలు 4 ట్రాన్స్ పోర్టు వాహనాల్లో విజయవాడకు పంపించారు. ఈ వాహనాలకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి రత్నాల వరప్రసాద్, ఉద్యాన సాంకేతిక అధికారి కె.శ్రీరామ్మూర్తి, ఎం.అనుష, బి.అయింతికుమారి, నాబార్డు డిడిఎం రామకృష్ణ, బూర్జ మండలం పెద్దపేట ఆర్ప్ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు చెక్కును అందజేస్తున్న శ్రీనివాసరావు

సిఎం సహాయ నిధికి చెక్కు అందజేత

ప్రజాశక్తి- లావేరు

విజయవాడ వరద బాధితుల సహాయార్థం సిఎం రిలీఫ్ ఫండ్‌కు టిడిపి నాయకుడు లంకలపల్లి శ్రీనివాసరావు రూ.15వేలు చెక్కును ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో సాటి మనుషులు ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడానికి శ్రీనివాసరావును ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి సురేష్, ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, శ్రీనివాసరావు, నాయకులు మాకన శంకరరావు, కోలా రాజేష్, రమణ, రాంబాబు, రాజేశ్వరరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వ్యవసాయశాఖ జెడి శ్రీధర్

ప్రకృతి సేద్యంపై అవగాహన

వ్యవసాయ శాఖ జెడి కె శ్రీధర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

ప్రకృతి సేద్యంపై అవగహన పెరాగాలని, రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించడంతో పాటు సాగు చేస్తున్న స్థితిగతులపై అధ్యయనం చేయాలని వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ కె.శ్రీధర్ అన్నారు. ఆచార్య ఎన్. జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాగోలు వ్యవసాయ పరిశోధన స్థానం, వ్యవసాయశాఖ సంయుక్తంగా వ్యవసాయ శిక్షణ క్షేత్రాల్లో శుక్రవారం సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో పెట్టుబడి తగ్గించుకునేందుకు వీలుగా శాస్త్ర సాంకేతిక రంగాలను అన్వయించుకునే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. రైతులకు పొలంపిస్తోంది కార్యక్రమం ద్వారా శాస్త్రవేత్తలు మెరుగైన సూచనలు సలహాలు అందించాలన్నారు. సమావేశంలో వ్యవసాయ పరిశోధనా కేంద్రం హెడ్, శాస్త్రవేత్త డాక్టర్ పి.ఉదయబాబు, శాస్త్రవేత్తలు డాక్టర్లు కె.భాగ్యలక్ష్మి, చిట్టిబాబు, కె.మధుకుమార్, ఎస్.నీలవేణి, జి.శ్రీనివాస్, బి.స్వాతి పాల్గొన్నారు.

సేవాభావం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి- పలాస

విద్యార్థులు చిన్నతనం నుంచే విద్యతో పాటు సేవాభావం అలవర్చుకోవాలని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ విశ్రాంత వైస్ ఛాన్సలర్ హనుమంతు లజపతిరాయ్ అన్నారు. మండలంలోని రామకృష్ణాపురంలోని సత్యసాయి విద్యా విహార్‌లో శుక్రవారం వ్యక్తిత్వ వికాస ప్రేరణ తరగతి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సత్యసాయి విద్యాలయాలు క్రమశిక్షణతో నడుస్తాయని అన్నారు. ప్రతి విద్యార్థి ప్రతిభా పరీక్షలు, పోటీల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులకు మేథాశక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతీచౌదరి, తాళాసు శ్రీను, జామి శ్రీను, గొర్లె నాగేశ్వరరావు, కృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న లజపతిరాయ్

థర్మల్ పవర్ ప్లాంట్‌తో యువతకు ఉపాధి

ఎమ్మెల్యే కూన రవికుమార్

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండల పరిసర ప్రాంతాల్లో సుమారు రూ.20 వేల కోట్ల పెట్టుబడితో థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటు జరిగితే యువతకు పూర్తిస్థాయి ఉపాధి అవకాశాలు లభిస్తాయని శాసనసభ్యులు కూన రవికుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని వెన్నెలవలస గిరిజన గ్రామంలో ఎంపిడిఒ పి.వి.మురళీమోహన్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ప్రధానమంత్రి జనజాతి ఆదివాసి న్యాయమహా అభియాన్ గ్రామసభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవికుమార్ శాఖల వారిగా గిరిజన సమస్యలపై సమీక్ష నిర్వహిస్తూ గృహ నిర్మాణ, విద్యుత్ శాఖ ఎఇలతో పాటు విఆర్ఒ, కార్యదర్శి, సచివాలయ ఉద్యోగుల తప్పుడు నివేదికలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో ఇటువంటి పొరపాట్లు చేయకుండా జాగ్రత్త పడాలని లేని యెడల క్షమించేది లేదని అధికారులను హెచ్చరించారు. ప్రభుత్వం గిరిజన సంక్షేమం కొరకు ఏర్పాటు చేసిన పిఎం జన్‌మన్ కార్యక్రమంలో గిరిజన సమస్యలను గుర్తించి సమగ్ర నివేదికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సరుబుజ్జిలి మండలం చిగురువలస, బూర్జ మండలం

అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రవికుమార్

అన్నంపేట పంచాయతీ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించడంతో పాటు థర్మల్ పవర్‌ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన వెయ్యి ఎకరాలను సమకూర్చితే ఈ ప్రాంతంలో థర్మల్ పవర్‌ప్లాంట్ ఏర్పాటు చేసి 40 వేల మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడానికి తాను సిద్ధంగా ఉన్నానని రవికుమార్ స్పష్టం చేశారు.

ఆర్గానిక్ పంటలపై దృష్టి సారించాలి

పిఎం జన్‌మన్ గ్రామసభకు ముందు బూర్జ ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ గీత, సూపర్‌వైజర్ రత్నాంజలి వెన్నెలవలస చర్చి వద్ద ఏర్పాటు చేసిన పోషకాహార మాస వారోత్సవాల కార్యక్రమంలో ఎమ్మెల్యే రవికుమార్ పాల్గొని అంగన్వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార పిండి వంటలు, కూరగాయలను పరిశీలించి బాలింతలు, గర్భిణీలకు బాలామృతం కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెన్నెలవలస గిరిజన రైతులతో రవికుమార్ మాట్లాడుతూ జిల్లాలో చాలా ప్రాంతాల్లో సేంద్రీయ ఎరువులతో ఆర్గానిక్ పంటలు పండిస్తున్నారని వీటివలన ప్రజారోగ్యం ఎంతగానో బాగుపడుతుందని గిరిజనులు తమ పోడు భూముల్లో ఆర్గానిక్ పంటలు పండించడానికి ముందుకు వస్తే జిల్లా వ్యవసాయ అధికారులను పంపించి సేంద్రియ ఎరువులతో ఆర్గానిక్ పంటల పండించే విధానాలపై అవగాహన కల్పించడానికి చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎల్. మధుసూదన్, టిడిపి నాయకులు అత్తులూరి గిరి, కొర్ను సూర్యనారాయణ, కిల్లి సిద్దార్థ, నందివాడ గోవిందరావు, శివ్వాల సూర్యనారాయణ, అంబల్ల రాంబాబు, తాడేల వెంకటరమణ, పల్లి రాము, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సన్మానిస్తున్న సంస్థ సభ్యులు

'ప్రజాశక్తి' విలేకరికి ఆత్మీయ సత్కారం

ప్రజాశక్తి- కవిటి

మండలంలో ఎన్నో సమస్యల పరిష్కారానికి అనునిత్యం తన కలంతో కృషి చేస్తున్న 'ప్రజాశక్తి' విలేకరి పూడి సత్యనారాయణ సేవలు వెలకట్టలేనివని బొరివంక మాజీ సర్పంచ్ అంతర్యామి, ఎంపిటిసి బెందాలం విజయకృష్ణ అన్నారు. ఇరు తెలుగు రాష్ట్రాల ఉత్తమ జర్నలిస్టు అవార్డుకు ఎంపికైన సత్యనారాయణను హెల్పింగ్ హేండ్స్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో పత్రికలది కీలక పాత్రని, అనతి కాలంలోనే అందులో విశేష ప్రతిభకనబరుస్తున్న సత్యనారాయణ మరిన్ని అవార్డులు అందుకోవాలని కొనియాడారు. కార్యక్రమంలో ఎఫ్‌పిఒ అధ్యక్షుడు బల్లెడ జయప్రకాష్, గ్రామస్తులు బల్లెడ శ్రీను, ఆముదాల భాస్కర్, కాశీసాహు, విశ్వేశ్వరరావు, హెల్పింగ్ హేండ్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రేపట్నుంచి అథ్లెటిక్స్ పోటీలు

శ్రీకాకుళం అర్బన్: కొన్న చిన్నారావు అథ్లెటిక్స్ పోటీలు సోమవారం నుంచి ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నట్టు నిర్వహకులు కొన్న వాసు, మధుసూధనరావు, అశోక్‌కుమార్, పూడి బాలాదిత్యలు తెలిపారు. క్రీడాకారులను ప్రోత్స హించేందుకు ప్రతిఏటా పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అండర్ – 14, 16, 18, 20 వయో విభాగాల్లో బాల బాలికలకు వేర్వేరుగా 100 మీటర్లు, 400, 800, 2 వేలు, 3 వేలు, 5 వేల మీటర్ల పరుగు పందాలు, లాంగ్ జంప్, హైజంప్, షాట్‌పుట్ కేటగిరిల్లో పోటీలను నిర్వహించ నున్నట్టు తెలిపారు.

నిబంధనలు తప్పనిసరి

మందస: వినాయక ఉత్సవాల్లో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని డిటి కృష్ణబాబు, ఎంపిడిఒ తిరుమలరావు, ఎస్ఐ కాదర్ బాష సూచించారు. మందసలో ఉత్సవ కమిటీ సభ్యులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండ శాంతియుత వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించాలన్నారు.

'ఐతమ్' విద్యార్థులకు శిక్షణ

టెక్కలి రూరల్: టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో ద్వితీయ ఏడాదికి చెందిన 143 మంది ఇఇఇ విద్యార్థులకు ఎపిఎస్ఎస్ సి సిఎస్ ఎక్స్ లెన్స్ సెంటర్లో 'పిసిబి డిజైన్' అనే అంశంపై వారం రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్టు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. లైవ్ వైర్ సాఫ్ట్వేర్, డిజైన్ ఆఫ్ వేరియస్ సర్క్యూట్స్ ఇన్ లైవ్వైర్ సాఫ్ట్వేర్, పిసిబి-వైజ్డ్ సాఫ్ట్వేర్, పిసిబి-లేఔట్స్ డిజైనింగ్ వంటి అంశాల్లో శిక్షణ పొందడంతో ఆయా రంగాల్లో విద్యార్థులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ఈ తరగతులను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఇఇఇ హెచ్‌డి డాక్టర్ డి.విజయ్‌కుమార్, ఎపిఎస్ఎస్‌డిసి స్పోక్ డాక్టర్ బి.రామారావు, ఇఇఇ కో–ఆర్డినేటర్ జి.అశోక్, సిఎస్ సెక్షన్ కో–ఆర్డినేటర్ కె.బి.అనూష, ఎపిఎస్ఎస్ సి శిక్షకులు సంతోష్‌లు పర్యవేక్షణలో నిర్వహిస్తున్నామని తెలిపారు.

వృథాగా పోతున్న తాగునీరు

తాగునీరు వృథా

కొత్తూరు : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల రోడ్డులోని జల జీవన్ పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన తాగునీటి పైపులైన్ లీకైంది. దీంతో గ్రామాలకు సరఫరా కావాల్సిన తాగునీరు వృథా అవుతుంది. దీంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. అలాగే పరిసరాల్లో నీరు చేరి నిల్వఉంటుంది. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

శ్రీకాకుళం అర్బన్ : స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఎంఎస్‌సి ఆర్గానిక్ కెమిస్ట్రీ కోర్సులో మూడు గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు సంబంధించి దరఖాస్తును ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్‌సి కెమిస్ట్రీలో కనీసం 55 శాత మార్కులు కలిగి ఉండి నెట్/సెట్/ పిహెచ్‌డి అర్హతలు కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. అర్హతలు కలిగి ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 10వ తేదీ ఉదయం 10 గంటలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో కళాశాలలోని కెమిస్ట్రీ విభాగానికి హాజరు కావాలన్నారు.

రేపు ఆటల పోటీలు

సోంపేట : యుటిఎఫ్ స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం నియోజకవర్గస్థాయి ప్రభుత్వ ఉపాధ్యాయుల ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు లండ బాబురావు ఒక ప్రకటనలో తెలిపారు. కవిటిలో క్రికెట్, షటిల్ పోటీలు, కంచిలిలో వాలీబాల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నాలుగు మండలాలకు చెందిన సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాధ్యులుగా వ్యవహరిస్తారని తెలిపారు.

చొక్కాకులబంద ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘంలోని ఆరోవార్డు పరిధిలోని కాళింగ మన్నయ్యపేటలోని చొక్కాకుల బంద ఆక్రమణలను రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. గతంలో 'ఆక్రమణకు గురైన చొక్కాకుల బంధ' అన్న కథనంతో ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురించిన సంగతి పాఠకులకు విధితమే. శుక్రవారం జెసిబి సహాయంతో సర్వేనెంబర్ 290లో 5.60 ఎకరాల ప్రభుత్వ స్థలంలో ఉన్న ఆక్రమణలను తొలగించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పురపాలక సంఘ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ హనుమంతు వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆక్రమణలను తొలగిస్తున్నట్లు స్పష్టం చేశారు. చొక్కాకుల బంద ఆక్రమణలు తొలగిస్తుండడంతో ఆయకట్టు రైతులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతుల

చొక్కాకుల బంద ఆక్రమణలు తొలగిస్తున్న మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది

సమస్యను వెలుగులోకి తీసుకువచ్చి పరిష్కరించడానికి కృషిచేసిన ప్రజాశక్తి దినపత్రికకు సాగు రైతులు కూన సుందరరావు, గురుగుబెల్లి రాజశేఖర్, అన్నెపు కృష్ణకాంత్, గురుగుబెల్లి కృష్ణమూర్తి, పైడి మోహనరావు తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విఆర్ఒ కె.చంద్రరావు, గణేష్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసికి పూర్వవైభవం తీసుకొస్తాం

ఎమ్మెల్యే గొండు శంకర్

జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆర్‌టిసిని పూర్వవైభవం దిశగా నడిపించే బాధ్యత అధికారులతో పాటు ప్రతి ఉద్యోగిపై ఉందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో శ్రీకాకుళం నుంచి విజయనగరానికి నూతన బస్సు సర్వీసును శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌టిసి ప్రగతి రథచక్రానికి సారథులు కిందిస్థాయి ఉద్యోగులే అన్నారు. వారు అంకితభావంతో సేవలందించేలా చూడాల్సిన బాధ్యత అధికారులుగా మనపై ఉందన్నారు. ప్రయాణీకుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఇటీవల కొత్త బస్సులను ప్రారంభించామన్నారు. ఆర్‌టిసిని ఆదాయ వనరుగా తీర్చిదిద్దాలని, ఆర్‌టిసి ఆవరణలోని ఖాళీ స్థలాల్లో కమర్షియల్ భవనాలు నిర్మాణం చేపడితే ఆర్‌టిసికి ఆదాయం చేకూరు తుందన్నారు. కాంప్లెక్స్‌లో మౌలిక సదుపాయాలు కల్పించిన అవసరం ఉందని, వాటిపై ఆర్‌టిసి అధికారులతో చర్చించానని, త్వరలోనే అభివృద్ధి పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, డిపో మేనేజర్లు, కార్మికులు ఉన్నారు.

భద్రతా ప్రమాణాలు తప్పనిసరి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వినాయక నిమజ్జనం సందర్భంగా నాగావళినది వద్ద భద్రతా ప్రమాణాలు పాటించాలని లైఫ్ సేవింగ్ అసోసియేషన్ ఫౌండర్ జాతీయ లైఫ్ సేవింగ్ స్పోర్ట్స్ మెడలిస్ట్ షేక్ సుభాన్ పిలుపునిచ్చారు. నగరంలోని ఉమా రుద్ర కోటేశ్వరాలయం వద్ద అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. వినాయకుని నిమజ్జనంతో పాటు తుఫాన్ వలన వచ్చే వరదల సమయాల్లో లైఫ్ సేవింగ్ టీం అనేక మంది ప్రాణాలు కాపాడడంలో అద్భుతమైన కృషి చేస్తోందని తెలిపారు. గత నాలుగు ఏళ్లుగా వినాయక నిమజ్జనం సందర్భంగా లైఫ్ సేవింగ్ టీం ఉండడంతో ఎటువంటి ప్రమాదాలు లేకుండా సజావుగా జరుగుతున్నాయన్నారు. గతంలో వినాయక నిమర్జనం కార్యక్రమంలో ఎవరో ఒకరు ప్రాణాలు కోల్పోతూ ఉండేవారన్నారు. వినాయక నిమజ్జనం జరిగేటప్పుడు లైఫ్ సేవింగ్ గార్డ్స్ సహకారంతో నిమజ్జనం చేయాలని, వారు చెప్పిన సూచనలు పాటించాలని కోరారు. పర్యావరణ పరిరక్షించే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని,

మాట్లాడుతున్న సుభాన్

ప్లాస్టిక్ కవర్లు సూచించిన ప్లేస్‌లో మాత్రమే వెయ్యాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు లైఫ్ సేవింగ్ అసోసియేషన్ టీమ్ 20 మంది సభ్యులతో నాగావళి నది నిమజ్జనంలో పనిచేస్తుందన్నారు. ఈ సమావేశంలో లైఫ్ సేవింగ్ అసోసియేషన్ రాష్ట్ర సెక్రటరీ, బాలాజీ ఆర్గనైజింగ్ సెక్రటరీ నోపాడు రాజారావు, సీనియర్ స్విమ్మింగ్ క్రీడాకారులు సత్తిరాజు, సహదేవుడు, పొన్నాడ ప్రసాద్, లైఫ్ సేవర్ రాకోటి కిషోర్, భాను, రాజేష్, శ్రీను, అష్రఫ్‌అలీ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర థియేటర్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ భరత్ నాయక్

ధరల పట్టికలు ఏవీ?

ఆర్‌డిఒ భరత్ నాయక్

ప్రజాశక్తి- పలాస

సినిమా థియేటర్ల వద్ద పాత ధరలు పట్టిక మాత్రమే ఉందని, కొత్త ధరల పట్టిక ఎందుకు పెట్టడం లేదని ఆర్‌డిఒ భరత్ నాయక్ యజమానులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని వెంకటేశ్వర, హరిశంకర్, భాస్కరామ థియేటర్లను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సినిమా థియేటర్ల వద్ద టిక్కెట్ ధరల పట్టిక బోర్డులు సక్రమంగా లేవని, థియేటర్ల ఎదుట పాత ధరల పట్టికలు ఉండడం చూసి సంబంధిత యజమాన్యం పిలిచి ఇది సరైంది కాదని హెచ్చరించారు. తక్షణమే కొత్త బోర్డులు పెట్టాలని ఆదేశించారు. అనంతరం ఆయన థియేటర్లతో కల్పిస్తున్న పార్కింగ్, తినుబండారాల సాల్ట్, మరుగుదొడ్లు, సీట్లు, విద్యుత్ సరఫరా, అగ్నిమాపక నిబంధనలను పరిశీలించారు. కొన్ని థియేటర్లలో మరుగుదొడ్లు అధ్వానంగా ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్కింగ్‌కు కేటాయించిన స్థలాల్లో షెడ్లు లేని విషయాన్ని గుర్తించి యాజమానులకు తగు ఆదేశాలు ఇచ్చారు. థియేటర్లలోని సౌకర్యాలపై జెసికి నివేదిస్తామని తెలిపారు. ఈయన వెంట తహశీల్దార్ బి.సత్యం, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోరూ..

ప్రజాశక్తి- పలాస

పలాస–కాశీబుగ్గ జంటపట్టణాల్లో అక్రమ నిర్మాణాలు జోరుగా జరుగుతున్నాయని, దీనిపై పరిశీలించి చర్యలు తీసుకోవాలని కాశీబుగ్గకు చెందిన నాయకులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే గౌతు శిరీష, మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు, ఇన్‌ఛార్జి కమిషనర్ అప్పలరాజులను శుక్రవారం కలిసి వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్లు, కాలువలు కబ్జా చేశారని, మున్సిపల్ అధికారుల అనుమతులు లేకుండా నిర్మాణాలు చేస్తున్నారని ఉదహరించారు. ఎల్‌ఎసి కార్యాలయం వెనుక భాగంలో ఐదు అంతస్తుల భవనాన్ని అనుమతులు లేకుండా నిర్మిస్తున్నారని తెలిపారు. ఆ నిర్మాణం వల్ల చుట్టు పక్కల

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉన్న చిన్నపాటి గృహాలకు ప్రమాదంగా మారిందన్నారు. వినతిపత్రం సవర్పించిన వారిలో మోహన్‌రాజు, అప్పారావు, జనార్థనరావు, ప్రసాదరావు, షణ్ముఖరావు షాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎపిఎం ప్రసాదరావు

వరద బాధితులకు సాయం చేయాలి

ఇచ్ఛాపురం: మండల మహిళా సమైక్య సమావేశంలో విజయవాడ వరద ముంపు బాధితులకు ఆర్థికసాయం చేయాలని తీర్మానించారు. ఎపిఎం ప్రసాదరావు ఆధ్వర్యాన శుక్రవారం మండల మహిళా సమైక్య సమావేశం నిర్వహించారు. వరద బాధితులకు ఆర్థికసాయంతో పాటు పలు అంశాలపై చర్చించారు. ప్రతి సంఘంలోనూ మహిళా సంఘ సభ్యులు ఆదాయ కార్యక్రమాలు చేసుకోవడానికి, సబ్సిడీ రుణాలు ఉపయోగించుకునే విధంగా, మండలంలోని అర్హత ఉన్న సభ్యులందరూ రైతు ఉత్పత్తిదారులు సంఘాలుగా ఏర్పడాలన్నారు. ప్రతి సంఘ సభ్యరాలు పేరటి తోటలో, చిరుధాన్యాలు పండించుకునేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వంద రోజుల ప్లాన్ పథకాలకు కార్యాచరణ ప్రణాళిక తయారు చేయడం మంచిదన్నారు. ఈ నెల 15 నుంచి ఆడిట్ ప్రారంభించాలన్నారు. అధ్యక్షులు సుశీల, సిసిలు మోహనరావు, లక్ష్మి, మోహిని పాల్గొన్నారు.

కాశీబుగ్గ వాసి మృతి

ప్రజాశక్తి- పలాస

ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

రాజమండ్రి దివాన్ చెరువు జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో కాశీబుగ్గకు చెందిన రెండో ఏడాది బిటెక్ చదువుతున్న ఇంజినీరింగ్ విద్యార్థి రోణంకి ప్రవీణ్ కుమార్ (20), పాటు అతని స్నేహితుడు చింత కార్తీక్ (19) అక్కడికక్కడే మృతి చెందారు. కాశీబుగ్గలో నివాసం ఉంటున్న తల్లిదండ్రులు రోణంకి త్రోహి దాస్, సరస్వతిల ఇంటికి ప్రవీణ్ కుమార్ అక్క చరిస్మా జన్మదిన వేడుకలను జరుపుకునేందుకు కాశీబుగ్గ వచ్చింది. వేడుకల అనంతరం అక్క తన కుమార్తెతో పాటు తిరిగి హైదరాబాద్ వెళ్లేందుకు పలాసలో రైలు ఎక్కింది. రాజమండ్రి రైల్వే స్టేషన్‌లో అక్కను కలిసేందుకు స్నేహితుడు చింత కార్తీక్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. వెనుక నుంచి వస్తున్న లారీ బలంగా ఢీకొండంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. వారి శరీర భాగాలు రోడ్డుపై చెల్లాచెదురవడంతో చూపరులను భీతిగొల్పింది. ఈ సంఘటనపై రాజమండ్రి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రవీణ్ కుమార్ మృతి చెందడంతో స్వగ్రామం కాశీబుగ్గలో విషాద ఛాయలు నెలకొన్నాయి. కుమారుడు మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

చెరువులో పడి యువకుడు మృతి

చిన్నంనాయుడు (ఫైల్)

నందిగాం/బూర్జ: మండలంలోని నందిగామ వద్ద కల ఎదురుబంద చెరువులో పడి వ్యక్తి మృతి చెందాడు. బూర్జ మండలంలోని ఎ.పి. పేటకు చెందిన గిరాడ చిన్నం నాయుడు (రాజు) (35) ఈ నెల 4న ఇంటి నుంచి బయలుదేరి సోంపేట వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో నందిగామ వద్ద బస్సు దిగి మద్యం తాగి సమీపంలో ఉన్న చెరువులో పడి మృతి చెందాడు. శుక్రవారం ఉదయం స్థానికులు చెరువులో తేలియాడు తున్న మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి పార్వతి ఫిర్యాదు మేరకు ఎస్ఐ మహమ్మద్ అమిర్ ఆలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య రేవతి ఉన్నారు. రెండు రోజుల క్రితం చెరువులో పడి మృతి చెంది ఉంటారని స్థానికులు భావిస్తున్నారు.

ప్రమాదానికి గురైన ద్విచక్రవాహనం

ఇద్దరికి గాయాలు

కోటబొమ్మాళి: మండలం జాతీయరహదారి జర్జంగి సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇదే మండలం సరియాబొడ్డపాడుకు చెందిన సనపల తవిటయ్యతో పాటు మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వీరికి స్థానిక 108 సహాయంతో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సనపల తవిటయ్యతో పాటు మరో వ్యక్తి ద్విచక్రవాహనంపై కోటబొమ్మాళి నుంచి సరియాబొడ్డపాడు వైపు వెళ్తున్నారు. టెక్కలి నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ షేక్‌మహ్మద్ అలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాలం చెల్లిన మందుల విక్రయంపై వ్యక్తికి శిక్ష

పొందూరు: ఔషధ చట్టం నిబంధనలు అతిక్రమించి కాలం చెల్లిన మందులు విక్రయించడంపై పైడి జగన్నాధం అనే వ్యక్తికి పొందూరు జ్యుడీషియల్ ఫస్టుక్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి బి.జ్యోత్స్న ఒక రోజు జైలుశిక్ష, రూ.50 వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ వి. సత్యనారాయణ తెలిపారు. 2019లో మండలం కింతలిలో శివ గణేష్ మెడికల్ దుకాణంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ లావణ్య, అధికా రులు తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో శివగణేష్ మెడికల్ దుకాణంలో ఫిజీషియన్ శాంపిల్స్ సంబం ధించిన 19 రకాల కాలం చెల్లిన మందులు ఉన్నట్లు గుర్తించి కేసునమోదు చేశారు. దీనిపై నేరం అంగీ కరించడంపై యజమాని పైడి జగన్నాధంకు శిక్ష, జరిమానా ఖరారు చేస్తూ తీర్పునిచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

ఆభరణాలపై రుణాలు

శ్రీకాకుళం రూరల్ : శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ రాబోయే పండుగ సీజన్‌కు ముందు కస్టమర్లకు సులభంగా, సౌకర్య వంతంగా నిధులను అందజేసే లక్ష్యంతో ఆంధ్ర ప్రదేశ్‌లో 'జిత్నే సమయ్‌కా లోన్ ఉత్నేకా హి బయాజ్' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని అందు బాటులోకి తీసుకు వచ్చినట్టు ఆ సంస్థ మేనేజర్ ఎలిజబెత్ వెంకటరామన్ చెప్పారు. శుక్రవారం నగరంలోని శ్రీరామ్ ఫైనాన్స్ కార్యాలయంలో జరిగిన కార్యక్ర మంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఆ వ్యాప్తంగా తన శాఖల్లో మౌలిక సదుపాయాలను అప్‌గ్రేడ్ చేసి గోల్డ్‌లోన్ శాఖలుగా మార్చడానికి పెట్టుబడి పెట్టా మన్నారు. బంగారు ఆభరణాలపై వినియోగదారులకు త్వరితగతన సులభతరంగా తక్కువ వడ్డీకి రుణాలు అందజేస్తున్నామన్నారు. అవస రాన్ని బట్టి బంగారాన్ని తాకట్టు పెట్టడం, రీడీమ్ చేయడం వంటివి జరుగుతున్నాయని, ఈ ఫీచర్ చాలా కీలకమైందని, హాలిడే సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో ఇది చాలా సహాయకరంగా ఉంటుందని చెప్పారు.

చెత్తబుట్టలను పంపిణీ చేస్తున్న నాయకులు

చెత్త బుట్టల పంపిణీ

పొందూరు: మండలం రాపాకలో సర్పంచ్ ప్రతినిది కొంచాడ గిరిబాబు ఆధ్వర్యంలో చెత్తబుట్టలు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తను రహదారులపై వేమకుండా చెత్తబుట్టలను ప్రతిఒక్కరూ వినియోగించాలని ఆయన కోరారు. కార్యదర్శి సిహెచ్ శాంతిస్వరూప్, టిడిపి, జనసేన నాయకులు బలగ శంకర భాస్కరరావు, కండాపు శ్రీను, ముల్లు హరనాథ్, కొంచాడ మనోహర్, కొంచాడ చిన్నం నాయుడు, సుమల రామకృష్ణ, శేషగిరి, జామాన అప్పలనాయుడు పాల్గొన్నారు.

కమిషనర్‌ను అభినందిస్తున్న గోవిందరావు

నాగావళి కాలుష్యంపై ఎన్‌జిసి వినతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నాగావళి నదిలో జల కాలుష్యంపై ఎపి ఎన్‌జిసి, శ్రీకాకుళం తరుపున జిల్లా కో-ఆర్డినేటర్ పూజారి గోవిందరావు, క్లస్టర్ కో-ఆర్డినేటర్ జి.మోహన్ నగరపాలక సంస్థ కమిషనర్ పివివిడి ప్రసాదరావుకు వినతిపత్రం అందజేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయనను శుక్రవారం కార్పొరేషన్‌లో ఆయన ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. నదిలో పారబోస్తున్న వ్యర్థాల్లో ప్లాస్టిక్ కవర్లతో జలచర జీవానికి హాని కలిగిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికితోడు భూగర్భ జలాలు కలుషితం అవుతున్నా యన్నారు. వేడుకల సమయంలో అనేక మంది పూలు, పత్రాలు వంటి సామగ్రిని ప్లాస్టిక్ కవర్లలో పెట్టి నదిలో పడేస్తున్నారని వివరించారు. దీనివలన సమస్య మరింత తీవ్రతరం అవుతుందన్నారు. కాలుష్యాన్ని అరికట్టేందుకు, నాగావళి నదిపై, ఏడురోడ్ల కూడలి, డే అండ్ నైట్ వంతెనల వద్ద చెత్త బుట్టలను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజలకు తమ వ్యర్థాలను, ప్లాస్టిక్ కవర్లను పారవేసేందుకు వీలు కల్పించాలని సూచించారు. నదిలో పడకుండా నివారించాలన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

ఎమ్మెల్యే ఆర్థికసాయం

పాతపట్నం : మండలం కేంద్రంలోని శివశంకర్ కాలనీకి చెందిన బుగత పోలమ్మ అనారోగ్యం, పేదరికం కారణంగా తన కుమారుడు జోసెఫ్‌కు ఫీజు కట్టి చదివించే స్తోమత లేకపోయింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తన క్యాంప్ కార్యాలయంలో ఆమెకు రూ.12 వేలు ఆర్థికసాయం శుక్రవారం అందజేశారు. భవిష్యత్‌లో ఏ సహాయం కావాలన్నా నేరుగా కార్యాలయానికి వచ్చి తనని సంప్రదించవచ్చునని తెలిపారు.

చెత్త సంపద కేంద్రానికి తరలిస్తున్న చెత్త

పరిశుభ్రతకు ప్రాధాన్యం

ప్రజాశక్తి - మెళియాపుట్టి

మండలంలో పరశురాంపురం పంచాయతీలో పరిశుభ్రతపై దృష్టి సారించి ప్రాధాన్యత ఇవ్వాలని వైస్ ఎంపిపి ఎస్.ఆదినారాయణ అన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి పారిశుధ్యంపై ప్రతి ఒక్కరూ మొదటి ప్రాధాన్యతగా పనిచేయాలన్నారు. వర్షాలు ఎక్కువగా ఉన్నందున గ్రామాల్లో చెత్త చెదారాలు లేకుండా చూడాలన్నారు. డ్రైయినేజీల్లో మురుగునీటిని తొలగించి శానిటైజర్ చేశారు. ఇంట్లో వచ్చే చెత్తను సంపద తయారీ కేంద్రానికి తరలించాలని సూచించారు. ఆయనతో పాటు సర్పంచ్ తంబుదు ప్రసాదరావు, కార్యదర్శి శివాజీ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

మండలంలోని చాపర, జోడూరు, వీడిపాలెం, బగద, భరణికోట, టకోయి, గావలవస గ్రామాల్లో ఎంపిడిఒ పడాల చంద్రకుమారి పర్యటించి పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి తిరుపతి పట్నాయక్, సర్పంచ్‌లు బమ్మిడి భాస్కరరావు, సవర రంగారావు, పెద్దింటి చందరరావు, బోసి రామారావు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: టెక్కలి మేజర్ పంచాయతీలోని సంభానవీధి, మెయిన్ రోడ్డు, జాతీయ రహదారిలో పారిశుధ్య పనులను ఎంపిడిఒ పి.విజయ లక్ష్మిబాయి పరిశీలించారు. ఈమెతో పాటు కార్యదర్శి వి.వి.వి.జగ్గరరావు ఉన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

ఇచ్ఛాపురం : పౌష్టికాహార వారోత్సవాలు సందర్భంగా పట్టణంలోని 15,17 వార్డులకు చెందిన కౌన్సిలర్లు ప్రతినిధులు అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త రాధిక, వైసిపి నాయకులు పిలక పోలారావు భాస్కరరెడ్డి, బెంక కోటేష్, టిడిపి నాయకులు సందిగాం కోటేశ్వరరావు, జన్నేల సంతోష్, జలాని, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : మండలంలోని ఐఖండిడ్డి అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు ఐసిడిఎస్ సిడిపిఒ సిహెచ్.హైమావతి పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్.రాజవతి, సూపర్‌వైజర్లు సత్యప్రియ, పద్మలత, నాయకులు బమ్మిడి గణపతిస్వామి, కర్రి అప్పారావు, కర్రి చెల్లయ్య, శివరాం పాల్గొన్నారు.

ఒడియా ఉపాధ్యాయునికి సన్మానం

ఇచ్ఛాపురం : జడ్‌పిహెచ్‌ఎస్ ఒడియా ఈదుపురం పాఠశాలలో ఒడియా ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న సురేష్ పాడి అతని సొంత సొమ్ము రూ.2 లక్షలతో అతని తల్లి శాంతిలతా పాడి జ్ఞాపకార్థం కళా మండపాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పాఠశాల హెచ్‌ఎం బి.రామారావు అధ్యక్షతన దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ కార్తికేశ్వర్ బెహరా, గ్రామ పెద్దలు రామచంద్ర బెహరా, బొంమాలి బెహరా, పాఠశాల కమిటీ మాజీ చైర్మన్ గౌరహరి బెహరా, పాఠశాల సిబ్బంది భాస్కర్ పాడి, సవితాకుమారి, దేవి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం

టెక్కలి : మండలంలోని తలగాం ఎట్ నౌపడ ఆర్‌ఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. 23 ఏళ్ల క్రితం పదో తరగతి చదువుకున్న విద్యార్థులు రూ.25 వేలు విలువజేసే కార్యాలయ వినియోగ సామగ్రిని శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.కృష్ణారావుకు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు వినియోగించేందుకు వీలుగా కుర్చీ, కంప్యూటర్, ప్రింటర్ వంటివి అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామమని రమేష్‌కుమార్, బొడ్డేపల్లి విద్యాపతి, బి.లత, బి.శ్రీనివాసరావు, రాజేశ్వరి, దిల్లేశ్వర, పూర్వ విద్యార్థుల రాయల శంకరరావు, శ్రీరాములు, కిషోర్ పాల్గొన్నారు.

పూండిలో ట్రాఫిక్ సమస్య

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

మండలంలోని పూండిలో ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు నిత్యం ఇబ్బంది పడుతున్నారు. శుక్రవారం మార్కెట్ జరగడంతో కిక్కిరిసిపోవడం రహదారి పైనే మోటార్ వాహనాలు, ఆటోలు, కార్లు పెట్టడం వల్ల బస్సులు రాకపోకలకు ఆటంకాలు ఏర్పడింది. ముఖ్యంగా వ్యాపారులు తమ సరుకులను రహదా రిపైన పెట్టడంతో ప్రయాణికులు తప్పుకోవడానికి వీలులేని పరిస్థితి. అయి తే ఇంకా గురువారం వారపుసంత కావడంతో ట్రాఫిక్ సమస్య ఎక్కువైంది.

నిలిచిన ఆర్‌టిసి బస్సు

మట్టి వినాయకుడిని పూజించాలి

పొందూరు : పంపిణీ చేస్తున్న మట్టివినాయక ప్రతిమలు

ఆమదాలవలస : మట్టి విగ్రహాలతో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు

శ్రీకాకుళం అర్బన్ : మట్టి బొమ్మలు పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు ఆర్‌టిసి కాంప్లెక్స్ రోడ్డులో శ్రీకంచి కామాక్షి విశ్వబ్రాహ్మణ సంక్షేమ సేవాసంఘం ఆధ్వర్యంలో 250 మట్టివినాయక ప్రతిమలను శుక్రవారం టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహనరావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు అనకాపల్లి శ్రీరంగనాయకులు, మండల ఉపాధ్యక్షుడు బాడాన శేషగిరి, దండా రవికుమార్, మద్దిలె శ్రీనివాసరావు, అనెం పాపారావు, కంచి కామాక్షి సేవాసంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మండలం రాపాక కూడలిలో జనసేన పార్టీకి చెందిన కోరుకొండ మల్లేశ్వరరావు, గులివిందల షర్మిలారాణి ఆధ్వర్యంలో మట్టివినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి కొంచాడ చిన్నంనాయుడు, టిడిపి జిల్లా తెలుగుయువత కార్యదర్శి బలగ శంకరభాస్కరరావు, జనసేన నాయకులు గార బాబూరావు, సిమ్మినాయుడు, ముళ్ల హరనాథ్, యలకల ఉమ, కండాపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మండలం పిల్లలవలస జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం సుగ్గు కాసులబాబు పర్యవేక్షణలో విద్యార్థులు మట్టి వినాయక ప్రతిమలను తయారుచేశారు. ఈ మట్టి వినాయక ప్రతిమలను ఉపాధ్యాయులకు, స్థానికులకు పంపిణీ చేశారు.

మండలం తాడివలస జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టివినాయక విగ్రహాల తయారీపై హెచ్‌ఎం బల్ల కంటయ్య, నేషనల్ గ్రీన్‌కోర్ క్లస్టర్ సమన్వయకర్త పూజారి హరిప్రసన్న ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. మట్టి వినాయక ప్రతిమలను చక్కగా తయారుచేసిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

పట్టణంలోని మానసవేణి హైస్కూల్‌లో కరస్పాండెంట్ ఎంఆర్‌ఆర్‌సిహెచ్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు మట్టివినాయక ప్రతిమలను తయారు చేశారు. ఈ వినాయక ప్రతిమలను విద్యార్థుల తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, స్థానికులకు పంపిణీ చేశారు.

శ్రీకాకుళం అర్బన్: ప్రభుత్వ మహిళ కళాశాల వృక్షశాస్త్ర విభాగం, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ సంయుక్తంగా విద్యార్థినులచే మట్టి వినాయక బొమ్మలను తయారు చేయించారు. అదే విధంగా 21 రకాల ఆకులను సేకరించి ప్రదర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సూర్య చంద్రరావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మట్టి బొమ్మలే తయారు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎస్.రుద్రమరాణి, సునీత, కళాశాల వైస్ ప్రిన్సిపల్ పి. శంకర నారాయణ, అకాడమిక్ కో-ఆర్డినేటర్ సిహెచ్ కృష్ణారావు, ఐక్యుఎసి కో-ఆర్డినేటర్ ఎస్. పద్మావతి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ సూర శ్రీనివాసరావు నగరంలోని శ్రీశక్తి కన్వెన్షన్ భవనం వద్ద వెయ్యి మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా మట్టి గణపతి విగ్రహాలను పూజించాలన్నారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ హర్షవల్లి ఆధ్వర్యాన

మట్టి వినాయకున్ని పూజించి పర్యావరణాన్ని రక్షిద్దామని డిఎస్‌పి సిహెచ్ వివేకానంద ప్రజలకు పిలుపునిచ్చారు. నగరంలోని రైతుబజారు జంక్షన్‌లో 10 వేల మట్టి వినాయక ప్రతిమలను లయన్స్‌క్లబ్ ఆఫ్ శ్రీకాకుళం హర్షవల్లి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు కె.ఎన్.ఎస్.వి ప్రసాద్, జోనల్ చైర్మన్ కరణం శోభారాణి, క్లబ్ అధ్యక్షులు వావిలపల్లి జగన్నాథనాయుడు, మాజీ జోనల్ చైర్మన్ చింతాడ కృష్ణమోహన్, సెక్రటరీ మణిశర్మ, ఉపాధ్యక్షులు తర్లాడ అప్పలనాయుడు, ట్రాఫిక్ ఎస్ఐ సందీప్, జోగినాయుడు, లక్ష్మణ్, మజ్జి సుమన్, చింతాడ గణపతి, ఎన్‌టి నాయుడు, కరణం హారిక పాల్గొన్నారు.

జిఎన్‌వి జ్యూయలర్స్ ఆధ్వర్యాన

నగరంలోని జిటి రోడ్‌లో జిఎన్‌వి జ్యూయలర్స్ అధినేతలు బోయిన గణేష్, ఊన్న మురళీ, ఊన్న కిరణ్, బోయిన పృథ్వీలు మట్టి వినాయక విగ్రహాలను ప్రజలకు పంపిణీ చేశారు.

ఆమదాలవలస: మట్టి వినాయక విగ్రహాలను పూజించి పర్యావరణ పరిరక్షణకై కృషి చేద్దామని అమ్మ దేవస్థానం నిర్మాణకర్త సనపల శ్రావణ్ కుమార్ అన్నారు. మండలంలోని చీమలవలస, కొత్తవలస, తొగరాం, నిమ్మతొర్లాడ, కట్యాచార్యులపేట, జి.కె.వలస, కొరపాం, గుత్తావల్లి గ్రామాల్లో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. అనంతరం తొగరాం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులతో పాటు ఆమదాలవలస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు. పట్టణంలోని వన్‌వే జంక్షన్, గాంధీ విగ్రహం వద్ద మట్టి విగ్రహాలను శ్రావణ్ కుమార్ తండ్రి విశ్రాంత ఉపాధ్యాయులు సనపల కృష్ణారావు స్వామి ఆధ్వర్యంలో అమ్మ దేవస్థానం కమిటీసభ్యులు భక్తులకు మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు.

పట్టణంలోని ఫ్లైఓవర్ దిగువన జనసేన జిల్లా కార్యదర్శి కోరుకొండ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ పాల్గొన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లావేరు : మండల కేంద్రం లావేరులో జనసేన నాయకుడు కోలా రాజేష్ ఏర్పాటు చేసిన మట్టి వినాయకుని విగ్రహాలు ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని ఎచ్చెర్ల మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర ప్రాంభించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు లంకలపల్లి శ్రీనువాసరావు, యినపకుర్తి రమణ, లంకలపల్లి బాబు, గండి సురేష్, దుర్గారావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పోలాకి : మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని రక్షిద్దామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని కత్తిరివానిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సిఎంఆర్ షాపింగ్ కాంప్లెక్స్ అధినేత మావూరి వెంకటరమణకి మట్టి వినాయక ప్రతిమలను శుక్రవారం అందజేశారు. ప్రతిఒక్కరూ మట్టి విగ్రహాలను పూజించాలని కోరారు. అనంతరం నియోజకవర్గ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. సిఎంఆర్ షాపింగ్ మాల్ మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

పాతపట్నం : స్థానికులకు జనసేన నియోజకవర్గ నాయకులు కొరిగాన భవానీ మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నక్క క్రాంతికుమార్, తలగాపు నవీన్, సిరిపురం సందీప్‌కుమార్, గేదెల గోవిందరావు, లుకలాపు మనోజ్‌కుమార్, గొరుశెట్టి రాంబాబు, కనకల సంతోష్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : పట్టణంలో రోటరీక్లబ్ ప్రతినిధులు పైడిశెట్టి దినేష్‌కుమార్, డాక్టర్ వేద వ్యాస, మధుకుమార్, రోహిత్, రామారావు, వి.సురేష్, గోపీచౌదరిలు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.

నరసన్నపేట : రంగులు, రసాయనాలతో తయారు చేసిన వినాయక ప్రతిమలను నీటిలో నిమజ్జనం చేయడంతో జల కాలుష్యమవుతుందని పద్మావతి డిగ్రీ కళాశాల డైరక్టర్ సిహెచ్.దుర్గాప్రసాద్ తెలిపారు. పట్టణంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యాన మట్టి వినాయకులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ ఇన్‌ఛార్జి శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కె.రాము పాల్గొన్నారు.

కొత్తూరు : కొత్తూరు జనసేన నాయకులు అశోక్, జయరాజ్, వెంకటరావు, సింహాచలం, శంకర్, పోగిరి రవిలు మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు.

కోటబొమ్మాళి : వంశధార విద్యా సంస్థల అధినేత చింతాడ అనిరుద్రుడు సిబ్బందికి, విద్యార్థులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.

పాతపట్నం : పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు వెయ్యి మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు పైల బాబ్జి, సైలాడ సతీష్, సిర్ల ప్రభాకరరావు, జోగారావు, అక్కంద్ర సన్యాసిరావు, శాసనపురి బుల్లిబాబు, శివాల చిన్నయ్య, ఆనందరావు, మన్మథరావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మెళియాపుట్టిలో జనసేన నాయకులు దుక్క బాలరాజు, సలాన రాఘవరావు, పిట్ట హరికృష్ణ, ఎస్.చంటి, చింతల ప్రశాంత్, నక్క వెంకటరావులు మట్టి వినాయకులను పంపిణీ చేశారు.

కంచిలి : కంచిలి కళింగ కోమటి సంఘం ఆధ్వర్యాన ఎమ్మెల్యే బెందాళం అశోక్ రెండు వేల మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ జయలక్ష్మి, ఎంపిడిఒ నీరజ, సిఐ మంగరాజు పాల్గొన్నారు.


శ్రీకాకుళం అర్బన్ : బొమ్మలు పంపిణీ చేస్తున్న డిఎస్‌పి వివేకానంద

పోలాకి : మట్టి విగ్రహాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణ

లావేరు : వినాయక విగ్రహాలు పంపిణీ చేస్తున్న తోటయ్యదొర

శ్రీకాకుళం అర్బన్ : జిఎన్‌వి జ్యూయలర్ ఆధ్వర్యంలో పంపిణీ

మట్టి వినాయక విగ్రహాల తయారీ

నౌపడ : సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు మట్టితో వినాయకుని విగ్రహాలు తయారు చేశారు. జీవశాస్త్ర ఉపాధ్యాయుడు వీరభద్రరావు శిక్షణలో 68 విగ్రహాలను తయారు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కరరావు, లక్ష్మీకాంతం, తిరుపతిరావు, ఆదికేశవరెడ్డి, నాగేశ్వరరావు, పార్వతి, ఉమ, రాము, చిన్నారావు, మురళీధరరాజు, రవికుమార్, విజయలక్ష్మి, మార్కండేయులు, కృష్ణవేణి, రోజా, యమున పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

జెసిబి సహాయంతో తొలగిస్తున్న పిచ్చిమొక్కలు

ప్రజాశక్తి- రణస్థలం

కోష్ట పంచాయతీలో పారిశుధ్య పనులు సంతృప్తికరంగా ఉన్నాయని గ్రామ, వార్డు సచివాలయ నోడల్ అధికారి, డిఎల్‌డిఒ ఎస్.వాసుదేవరావు అన్నారు. పల్లెపేటలో చేపడుతున్న పారిశుధ్య పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను అప్రమత్తం చేయాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. ఈ పనులను ఎంపిడిఒ ఆర్.వి.రమణమూర్తి, ఇఒపిఆర్‌డి ప్రభాకరరావు, సర్పంచ్ పి.చిన్నంనాయుడు, టిడిపి నాయకులు పి.జగన్నాథం నాయుడు, ఎంపిటిసి అసిరి నాయుడు, మాజీ ఎంపిటిసి పి.అప్పడుదొర పనులను పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా కార్యదర్శి శ్రీధర్ మాట్లాడుతూ పంచాయతీలో నాలుగు గ్రామాల్లో వారం రోజులుగా ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నామన్నారు. గ్రామస్తులందరూ స్వచ్ఛ పంచాయతీ సాధనకు సహకరించాలని కోరారు. సచివాలయ ఉద్యోగులు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పొందూరు: మండలం తండ్యాం పంచాయతీ పరిధిలో సర్పంచ్ కిల్లారి అప్పలనారాయణమ్మ పర్యవేక్షణలో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపడుతున్నారు. కాలువల్లో పేరుకుపోయిన మురుగును, చెత్తాచెదారాలను తొలగించారు. రహదారులకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను జెసిబి సహాయంతో తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎన్.శంకరరావు, ఫీల్డు అసిస్టెంట్ కిల్లారి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ రోగికి బాసట

ప్రజాశక్తి- రణస్థలం

'మానవ సేవయే - మాధవ సేవ' అనే నినాదంతో ముందుకు వెళ్తున్న 'మేమున్నాం' సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పచ్చిగుళ్ల సాయిరాం తన సంఘంతో ఆపదలో ఉన్న అనేక మందికి మేమున్నామంటూ ఆదుకుంటున్నారు. రెండు కిడ్నీలు పాడైన ఓ ప్రైవేట్ ఉపాధ్యాయుడికి చేయూత నిచ్చి దాతృత్వం చాటుకున్నారు. మండల కేంద్రంలో 20 ఏళ్లక్రితం బతుకు తెరువు కోసం వెస్ట్ బెంగాల్ నుంచి వివిఎన్, రూప టీచర్ కుటుంబం వచ్చింది. సాఫీగా సాగుతున్న వారి కుటుంబానికి రెండేళ్ల కిందట కిడ్నీవ్యాధి రూపంలో మహమ్మారి దాపురించింది. అప్పటి నుంచి ఆ కుటుంబం ఆర్థికంగా చితికిపోయింది. దిక్కుతోచక నిస్సహాయ స్థితిలో మంచంపై పడి ఉన్న వివిఎన్ ఉపాధ్యాయుడిని మేమున్నాం సేవాసంఘం వ్యవస్థాపక అధ్యక్షులు సాయిరాం వివియన్ మాస్టర్‌కు డయాలసిస్ నిమిత్తం కొంత ఆర్థికసాయం చేసి ఆదుకున్నారు. వారానికి రెండుసార్లు డయాలసిస్ చేయడానికి వారికి అంత స్తోమత లేక దాతల కోసం ఎదురు చూస్తున్న తరుణంలో మేమున్నాం సేవా సంఘం సభ్యులు కొంత మొత్తాన్ని విరాళాలు సేకరించి రూ.20 వేలు మొత్తాన్ని స్థానిక జెఆర్ పురం ఎస్ఐ చిరంజీవి చేతులమీదుగా వివిఎన్ మాస్టర్‌కు శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో యువటీం అంజి బాబు, ఎన్. కళా వెంకటరావు, ఎస్‌కె బజార్, చంద్ర శేఖర్, ఉపాధ్యాయ సిబ్బంది, ఎన్.ఆనందం తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయాన్ని అందజేస్తున్న ఎస్ఐ చిరంజీవి

జీవకోటి మనుగడకు మొక్కలు దోహదం

రణస్థలం : మొక్కలు నాటుతున్న హరిత సొసైటీ కన్వీనర్ హరిబాబు, భవాని

ప్రజాశక్తి- పొందూరు

జీవకోటి మనుగడకు, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతగానో దోహదపడతాయని ఎంఇఒ-2 పట్నాన రాజారావు అన్నారు. మండలం పిల్లలవలస జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో వనమహోత్సవంలో భాగంగా హెచ్‌ఎం సుగ్గు కాసులబాబు ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణంలో బాదం, తులసి, ఉసిరిక, మారేడు వంటి పలు రకాల మొక్కలను నాటి విద్యార్థులకు దత్తతగా ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జగదాంబ, రమణారావు, మురళీమోహన్, నీరద, కృష్ణ, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం: ప్రకృతిని పరిరక్షించే సంప్రదాయాన్ని బాల్యదశ నుంచే అలవాటు చేయాలని హరిత సమగ్ర గ్రామీణాభివృద్ధి సొసైటీ కన్వీనర్ ఆర్.హరిబాబు అన్నారు. శుక్రవారం హరిత సొసైటీ కన్వీనర్ రొంగలి హరిబాబు సతీమణి భవాని పుట్టినరోజు సందర్భంగా స్థానిక కోష్ట శ్రీ గణపతి దుర్గాదేవి సుబ్రమణ్యస్వామి ఆలయ ప్రాంగణంలో పనస, వేప మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ప్రస్తుత సమాజంలో యువత, తల్లిదండ్రులు తమ పిల్లల పుట్టిన రోజు పేరిట భారీ వేడుకలకు ధనాన్ని వృధా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుమార్తె పుట్టిన రోజున పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టిన రొంగళ హరిబాబు, భవాని దంపతుల ఆలోచనకు హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచపు ప్రస్తుత అవసరాన్ని దష్టిలో పెట్టుకుని తమవంతుగా మొక్కలు నాటుతున్న నీతూశ్రీ తల్లిదండ్రులను హరిత సొసైటీ సెక్రటరీ పి.తవిటినాయుడు సహా పలువురు అభినందించారు. కార్యక్రమంలో హరిత సభ్యులు ఎం.వి.రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు పికెఎస్ జిల్లా మహాసభలు

పలాస : మండలంలోని బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరం వద్ద ఈ నెల 8న ప్రగతిశీల కార్మిక సమాఖ్య మహాసభలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండారెడ్డి తెలిపారు. కాశీబుగ్గలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. గత 14 ఏళ్ల నుంచి సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలపై పెద్ద ఎత్తున ఉద్యమిస్తున్నామని అన్నారు. ఈ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.

రాజ్యాంగంపై అవగాహన

పలాస : భారతదేశ గమనం పౌరులకు పాలకులకు దిక్సూచి అయిన రాజ్యాంగంపై విద్యార్థులకు అవగాహన కలిగి ఉండాలని బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ జిఎంఎస్ అనిల్ రాజు పేర్కొన్నారు. కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిన్నంనాయుడు అధ్యక్షతన విద్యార్థులకు రాజ్యాంగంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సదస్సులో రాజ్యాంగంలోని ఆర్టికల్స్, హక్కులు, ఆదేశిక సూత్రాలు కొన్ని అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాసుదేవరావు సేవలు చిరస్మరణీయం

మందస : గ్రేడ్‌వన్ పంచాయతీ సెక్రటరీగా తెంబ వాసుదేవరావు చేసిన సేవలు చిరస్మరణీయమని షెడ్యూల్ తరగతుల సంక్షేమ సంఘం కార్యదర్శి కొత్తపల్లి మోహనరావు అన్నారు. మందసలోని అంబేద్కర్ విజ్ఞాన్ భవన్ కేంద్రంలో వాసుదేవరావు సంస్మరణ సభ శుక్రవారం నిర్వహించారు. సంక కాళిదాసు, తులసీదాస్, ఇప్పిలి చంద్రశేఖర్, తంబ శ్రీను యానాది, వల్లభరావు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశీలిస్తున్న ఎంపిడిఒ వెంకటరమణ

మోడల్ స్కూల్ సందర్శన

సోంపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ పాఠశాలను స్థానిక ఎంపిడిఒ బి.వెంకటరమణ శుక్రవారం పరిశీలించారు పరిసర వీధుల నుంచి మురుగునీరు పాఠశాల ఆవరణలోకి చేరి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ప్రిన్సిపాల్ చిన్నాజీవర్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పరిశీలించాఉ. విద్యార్థులకు ఇబ్బందులకు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, ఎఇ కె.రమేష్, కమల్ వికాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి ఆర్థికసాయం

వజ్రపుకొత్తూరు : కేన్సర్‌తో బాధపడుతున్న మద్ది కాంతమ్మకు యువతరం సేవా సమితి అండగా నిలిచింది. ఆమెను కాశీబుగ్గలో కలిసి రూ.11 వేలు ఆర్థికసాయం శుక్రవారం అందజేశారు. ఆమె గత రెండు నెలలుగా కేన్సర్‌తో బాధపడుతుంది. కార్యక్రమంలో చింత మురళి, ఇన్‌ఛార్జి గోరకల సునీల్, అన్నెపు లక్ష్మణరావు, బత్తిని విగ్నేష్, సైనీ లోకేశ్వరరావు పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న అధికారులు

రూ.1.15 లక్షల చెక్కు అందజేత

పలాస : ఎమ్మెల్యే కార్యాలయంలో పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ మెప్మా ఆధ్వర్యాన విజయవాడ వరద బాధితులకు అండగా నిలిచేందుకు తమ వంతుగా రూ.1.15 లక్షలు చెక్కును ఎమ్మెల్యే గౌతు శిరీషకు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో మెప్మా అధికారులు మోహన్, సిఒ బాలరాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దీక్షలో పాల్గొన్న బెంతు ఒరియాలు

255 రోజులకు దీక్ష

కవిటి: తమ సమస్యల పరిష్కారానికి కవిటి బస్టాండ్‌లో బెంతు కొరియాలు చేస్తున్న నిరాహార దీక్షలు 255వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా గురువారం దీక్షలో పాల్గొన్న బెంతు ఒరియా యూత్ అధ్యక్షుడు సుమన్ బిసాయి మాట్లాడుతూ మరికొద్ది రోజులాగితే దీక్ష ప్రారంభించి ఏడాది గడుస్తుందని, కానీ, తమ సమస్యలకు పరిష్కారం ఎప్పటికి లభిస్తుందో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా తమ విద్యార్థులు విలువైన జీవితాన్ని కోల్పోతున్నారని అన్నారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన తమలో చాలామంది ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి తమ దీక్షలకు న్యాయం చేసి తమ యువతకు, విద్యార్థులకు మార్గం చూపించాలని కోరారు. ఈ దీక్షలో బిమ్మో బిసాయి, దయానిధి దొలాయి పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని పెద్దకొత్తకోట సర్పంచ్ శాంతాటి భాస్కరరావును ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ శుక్రవారం పరామర్శించారు. భాస్కరరావు తండ్రి రమణయ్య అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్ భాస్కరరావును పరామర్శించారు. ఎమ్మెల్యేతో పాటు ఎంపిపి ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, వైసిపి నాయకులు లుట్ట ఎల్లయ్య, గుమ్మడి దుర్గారావు, శ్రీనువాసరావు, గొర్లె ప్రభాకర్ నాయుడు ఎంపిటిసి గంట్యాడ సత్యం, లింగాల రామప్పడు, మధు, శ్యామలరావు, దుర్గారావు తదితరులున్నారు.

భాస్కరరావును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్